
సాక్షి ఒడిశా

ఆదివారం । 17 । మార్చి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 2,78,863
బంగారం	950 మిల్లీ గ్రాములు
వెండి	660 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



14 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం

రాజధాని భువనేశ్వర్‌లో శనివారం జరిగిన మంత్రి మండలి చివరి సమావేశంలో 14 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

- 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది (సా॥)	సోమ (ఉ॥)
6.02	4.39

న్యూస్‌రీల్

గవర్నర్ పరామర్శ



ప్రసన్న ఆచార్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజ్యసభ మాజీ సభ్యుడు, బిజూ జనతా దళ్ ఉపాధ్యక్షుడు ప్రసన్న ఆచార్యను గవర్నర్ రఘుబర దాస్ శనివారం పరామర్శించారు. స్థానిక అపోలో ఆస్పత్రికి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లోయలో పడిన పికప్ వ్యాన్



లోయలో పడిన వ్యాన్

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి పాలమా పంచాయతీలోని కుసేబేటి రహదారి మలుపు వద్ద ఒక వ్యాన్ అదుపు తప్పి పక్కనే గల లోయలో పడిపోయింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కల్యాణసింగుపూర్ నుంచి వ్యాన్‌లో సామాన్లను రాయగడకు తీసుకువస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

యువకుడి హత్య



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో సంజయ్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి సీకపల్లి పంచాయతీకి చెందిన ఓ యువకుడు కొందరు వ్యక్తులు కొట్టి చంపేశారు. మల్కన్‌గిరి సమితి యంవీ 41 గ్రామంలో ఓ పెళ్లి విందుకు వెళ్లి వస్తున్న సంజయ్ బైరాగి(29) అనే యువకుడిని కొందరు యువకులు కొట్టి పారిపోయారు. అటుగా వచ్చిన వారు క్షతగాత్రుడిని చూసి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదుచేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



బైపాస్‌లో బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

బరంపురం : నగర శివారులోని బరంపురం విశ్వవిద్యాలయం సమీపంలో బైపాస్ రోడ్‌లో రూ.1.56 కోట్ల రాష్ట్ర నిధులతో నిర్మించిన బస్‌ షెల్టర్‌ను ఎంపి చంద్రశేఖర్ సాహు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీసీ గీతాంజలిదాస్, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మెట్రిక్ ఫలితాలు

భువనేశ్వర్: ఈ ఏడాది నిర్వహించిన పదో తరగతి (మెట్రిక్యులేషన్) పరీక్ష ఫలితాలు సకాలంలో వెల్లడి కానున్నాయి. ఫలితాలు వెల్లడైన క్షణం నుంచి ఉత్తీర్ణులకు డిజిటైజ్డు ధ్రువీకరణ పత్రాలు లభిస్తాయని రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) ప్రకటించింది. ఒకవేళ ఆలస్యం అయినా వారం రోజుల్లో ఉత్తీర్ణులకు పత్రాలు అందుతాయని బోర్డు అధికారులు అభయం ఇచ్చారు.

పకడ్బందీగా మూల్యాంకనం

పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోంది. 55 కేంద్రాల్లో మూల్యాంకనం కోసం ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియ సమగ్రంగా సీసీటీవీ నిఘాలో కొనసాగుతుందని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నాటికి మూల్యాంకనం ముగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక వైపు సార్వత్రిక ఎన్నికల ఒత్తిడి ఉన్న సకాలంలో మెట్రిక్ ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని శని వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన బోర్డు అధికారులు తెలిపారు.

మోగిన ఎన్నికల నగారా

- రాష్ట్రంలో ఎన్నికలకు షెడ్యూల్ జారీ
- నాలుగు విడతల్లో పోలింగ్
- మే 13 నుంచి ప్రారంభమై జూన్ 1 వరకు నిర్వహణ
- జూన్ 4న ఫలితాల వెల్లడి





రాష్ట్ర శాసనసభ నియోజక వర్గాల మ్యాప్

భువనేశ్వర్: ఎన్నికల నగారా మోగింది. ఒడిశా శాసనసభతో పాటు లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం రాష్ట్రంలో 4 దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మే 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు విడతలుగా పోలింగ్ జరుగుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ ప్రకటించారు. తొలి విడత పోలింగ్ మే 13న జరుగుతుంది. ఇందులో 28 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఎన్నిక జరగనుంది. మలి విడతలో 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 20న ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మే 25న 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడో విడత పోలింగ్ జరగనుంది. జూన్ 1న 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇలా నాలుగు దశల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగుస్తుంది.

లోక్‌సభ స్థానాలకు పోలింగ్..

కలహండి, నవరంగపూర్, బరంపురం, కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మే 13న తొలి విడత పోలింగు జరుగుతుంది. మే 20న బర్‌గడ్, సుందర్‌గడ్, బొలంగీరు, కంధమల్, అస్కా నియోజక వర్గాల్లో మలి విడత పోలింగు ప్రకటించారు. మే 25న మూడో విడత కింద సంబలపూర్, కెంజొహర్, ఢెంకనాల్, కటక్, పూరీ భువనేశ్వర్ లోక్‌సభ స్థానాల్లో ఎన్నిక నిర్వహిస్తారు. చివరగా 4వ విడత పోలింగు జూన్ 1న మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ పార్లమెంటరీ నియోజక వర్గాల్లో నిర్వహిస్తారు. దేశ వ్యాప్తంగా 7 దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో 147 శాసనసభ నియోజకవర్గాలు, 21 లోక్‌సభ స్థానాలకు జాతీయ స్థాయిలో వరుసగా నాలుగు, ఐదు, ఆరు, ఏడో దశల్లో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహించనున్నారు.

తొలి విడతలోనే అవిభక్త కొరాపుట్ జిల్లాలకు పోలింగ్



భువనేశ్వర్‌లో బీజేడీ కేంద్ర కార్యాలయం శంఖ భవన్ వద్ద కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి నేతృత్వంలో కొరాపుట్ జిల్లా బీజేడీ నాయకులు

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాలకు మే 13వ తేదీన పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో నాలుగు విడతలుగా పోలింగ్ జరగనుండగా మొదటి దశలోనే ఇక్కడ పోలింగ్ ముగుస్తుంది. అవిభక్త కొరాపుట్ జిల్లాలైన రాయగడ, కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్ గిరి జిల్లాలకు ఇది వర్తిస్తుంది. ఈ జిల్లాల్లో కొరాపుట్, నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఈ రెండు స్థానాలు ఎస్టీ కేటగిరీ రిజర్వేషన్ పరిధిలో ఉన్నాయి. ఒక్కో లోక్ సభ పరిధిలో 7 విధాన సభ స్థానాలు ఉన్నాయి. నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానంలో జొరిగాం, ఉమ్మర్ కోట్, డాబుగాం, నబరంగ్‌పూర్, కొట్ పాడ్, మల్కన్ గిరి, చిత్రకొండ స్థానాలు ఉన్నాయి. ఈ 7 స్థానాలు ఎస్టీ రిజర్వ్‌గా గుర్తించారు. కొరాపుట్ లోక్‌సభ స్థానంలో జయపూర్, కొరాపుట్, పొట్టంగి, లక్ష్మీపూర్, రాయగడ, గుణుపూర్, బిసంకటక్ స్థానాలు ఉన్నాయి. ఇందులో జయపూర్ జనరల్ కేటగిరి, కొరాపుట్ ఎస్సీ కేటగిరీ, మిగతా 5 స్థానాలు ఎస్టీ కేటగిరీ కింద ఉన్నాయి. 2004, 2009, 2014, 2019 వరుస సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థానాలు మొదటి దశ పోలింగ్‌లో ఉండడం గమనార్హం. ఈ సారి కూడా అదే ఆనవాయితీ కొనసాగింది.

ఇదీ షెడ్యూలు

కార్యక్రమం	తొలి విడత (28 శాసన సభ స్థానాలు)	మలి విడత (35)	మూడో విడత (42)	నాలుగో విడత (42)
గెజెట్ నోటిఫికేషన్	ఏప్రిల్ 18	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29	మే 7
నామినేషను దాఖలు ముగింపు	ఏప్రిల్ 25	మే 3	మే 6	మే 14
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26	మే 4	మే 7	మే 15
పోటీ ఉపసంహరణ గడువు	ఏప్రిల్ 29	మే 6	మే 9	మే 17
పోలింగ్ తేదీ	మే 13	మే 20	మే 25	జూన్ 1
ఓట్లు లెక్కింపు	జూన్ 4	జూన్ 4	జూన్ 4	జూన్ 4
ఎన్నికల ప్రక్రియ ముగింపు	జూన్ 6	జూన్ 6	జూన్ 6	జూన్ 6

అంగన్‌వాడీ కేంద్రాలుగా స్థాయి పెంపు



కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను పరిశీలిస్తున్న శుభ్ర శర్మ

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శుభ్ర శర్మ

రాయగడ: జిల్లాలో గల 493 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీలుగా గుర్తించడం జరిగిందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శుభ్ర శర్మ వెల్లడించారు. ఒక్కరోజు పర్యటనకు రాయగడకు వచ్చిన ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కలెక్టర్ మనోజ్ సత్యవన్ మహాజన్, సీడీపీఓలతో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలపై ఆరా తీశారు. మాతాశిశు సంరక్షణ, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. వారికి సకాలంలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 150 మంది జనాభా ఉన్నచోట మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఇకనుంచి అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించబడతాయన్నారు. స్థాయి పెంచిన అంగన్‌వాడీలతో కలిపి జిల్లాలో ప్రస్తుతం 2082 అగన్‌వాడీ కేంద్రాలున్నాయని వివరించారు. మమత పథకం కింద ఆర్థిక సహాయం వెంటనే చెల్లించాలని ఆదేశించారు. 11 సమితుల సీడీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పూరీలో బాంబు దాడి

- నలుగురికి గాయాలు

భువనేశ్వర్: పూరీ పట్టణంలో శుక్రవారం బాంబు దాడి జరిగింది. బల్లీఘాట్ దగ్గర భూదాన్ కూడలి ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఘటనలో 4 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ తక్షణమే చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. బల్లీఘాట్ దగ్గర భూదాన్ ప్రాంతం సుబ్రత్ కుమార్ దీక్షిత్ మోటారు వర్క్ షాప్ పైకి ఆగంతకులు బాంబులు రువ్వారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌మీద నుంచి వచ్చి ఈ చర్యకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులు గాయాలపాలయ్యారు. పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. తొలొబొణియా ఠాణా పోలీసులకు సమాచారం అందడంతో రంగంలోకి దిగి ఆగంతకుల కోసం గాలింపు ప్రారంభించారు.

ఆరోగ్య రంగంలో 'సినీ' సేవలు ప్రశంసనీయం

- డీపీహెచ్ఓ డాక్టర్ లోక్‌నాథ్ రాజు



మాట్లాడుతున్న డాక్టర్ లోక్‌నాథ్ రాజు

రాయగడ: ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలను అందించడంతోపాటు మహిళ,శిశు సంరక్షణ విషయంలో ఛైల్డ్ ఇన్ నీడ్ ఇన్‌స్టిట్యూట్ (సినీ) స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని డీపీహెచ్‌ఓ డాక్టర్ వి.లోక్‌నాథ్ రాజు అభిప్రాయపడ్డారు. స్థానిక సాయి ఇంటర్ నేషనల్ సంస్థలో శనివారం సినీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ, హరిజనలు అత్యధిక శాతం నివసిస్తున్న రాయగడ వంటి జిల్లాలో మహిళ, శిశు సంరక్షణతోపాటు కౌమర దశలో ఉన్న యువతుల జీవనశైలిలో మార్పులు తీసుకురావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు నడుం బిగించాలన్నారు. ఆరోగ్య రంగంలో సినీ సంస్థ చేపడుతున్న సేవల్లో భాగంగా ప్రభుత్వ తరఫున పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందితో కలిసి పని చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజల ఆహారపు అలవాట్లు మారడంలో 30 ఏళ్లకే మధుమేహం, రక్తపోటు బారిన అధిక శాతం మంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిని గుర్తించి వారిని చైతన్య పరిచే దిశగా సంస్థ పనిచేయాలన్నారు. అదేవిధంగా గతంలో ఆదివాసీలు 12 ఏళ్ల బాల్యంలోనే బాల్య వివాహాలు చేసుకునేవారని అయితే ఇటీవల కాలంలో వారిలో చైతన్యం పెరగడంతో బాల్యవివాహాల సంఖ్య బాగానే తగ్గిందని వివరించారు. సినీ సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ సస్మితి నాయక్ మహాపాత్రొ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ స్వపన్ బికాష్ సాహ సినీ సంస్థ వివరాలను వెల్లడించారు. గత 50 ఏళ్లుగా సంస్థ తన సేవలను అందిస్తుందన్నారు. పలు ఎజ్జీఓల ప్రతినిధులు పాల్గొన్నారు.

బిసంకటక్‌లో బీఎస్‌కేవై కార్డుల పంపిణీ



బీఎస్‌కేవై కార్డులను అందజేస్తున్న సుధీర్ దాస్, పక్కనే యశోద తదితరులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ పంచాయతీ కార్యాలయంలో బిజు స్వాస్థ్య కల్యాణ యోజన (బీఎస్‌కేవై) కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఎస్‌కేవై రాష్ట్ర శాఖ ముఖ్యసలహాదారుడు సుధీర్ దాస్ హాజరై 20 మంది లబ్ధిదారులకు ఈ కార్డులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన చికిత్సను అందించేందుకు ఈ కార్డులను పంపిణీ చేస్తుందని దాస్ వివరించారు. సమితిలో 213 మంది ఈ కార్డుల కోసం తమ పేర్లను నమోదు చేసుకోగా తొలివిడతగా 20 మందికి కార్డులను మంజూరు చేస్తున్నామని, తదుపరి మిగతా వారికి ఈ కార్డులు అందజేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు యషోదా హుయిక, సహడ సర్పంచు చంద్రమతి కుంభారిక, సమితి అసిస్టెంట్ ఇంజనీర్ ప్రత్యూష్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాయగడ: తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణసింగుపూర్ సమితి నారాయణపూర్ గ్రామస్తులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సుమారు 200 కుటుంబాలకు చెందిన దాదాపు వెయ్యిమంది ఇక్కడ నివాసముంటున్నా సరైన తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గత్యంతరం లేక రోడ్డెక్కి నిరసన తెలియజేయాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న కళ్యాణసింగుపూర్ పోలీస్ స్టేషన్ ఐఐసీ నీలకంఠ బెహరా ఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

470 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురు నిందితుల అరెస్టు



బరంపురం: పట్టుబడిన కంటైనర్



పట్టుబడిన గంజాయిని, నిందితులను ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

బరంపురం: గంజాం, రాయగడ జిల్లాల్లో 470 కిలోల గంజాయితో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాం జిల్లాలోని 16వ నంబర్ జాతీయ రహదారిలో బరంపురం వైపు అక్రమంగా గంజాయితో వస్తున్న కంటైనర్‌ను బరంపురం అబ్కారి విభాగం అధికారులు శనివారం దాడిచేసి పట్టుకున్నారు. 420 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్ చేశారు. బరంపురం ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మహంతి తెలిపిన వివరాల ప్రకారం.. కంటైనర్‌లో అక్రమంగా గంజాయి రవాణ అవుతున్నట్లు సమాచారం అందుకుని తనిఖీలు చేపట్టామన్నారు. కోడాసింగ్ బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంకు దగ్గర కంటైనర్‌లో 22 బస్తాల్లో గల 420 కిలోల గంజాయి పట్టుకుని సీజ్ చేశామన్నారు. అరెస్టు అయిన వారిలో పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధి ఫస్ట్‌గేట్ జంక్షన్‌లో నివాసం ఉంటున్న దీపక్ కుమార్, కాళుచరణ్ గౌడా, హరియాణా రాష్ట్రానికి చెందిన సబీర్ ఖాన్, ధీను మవత్‌లుగా గుర్తించామన్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.78 లక్షలు ఉంటుందన్నారు.

గంజాయి స్వాధీనం..

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీస్ స్టేషన్ పరిధి పిండాగుడి గ్రామం సమీపంలో ఒక వ్యక్తిని నుంచి 50 కిలోల గంజాయిని పుటాసింగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పిండాగుడి వద్ద అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి పట్టుబడింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుని శనివారం కోర్టుకు తరలించారు. నిందితుని పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

భారీగా గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి : చిత్రకొండ సమితి సంగం గూడ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిత్రకొండ ఐఐసీ ముఖుందో మేల్‌కు సంగం గూఢ అడవి నుంచి గంజాయి అక్రమంగా రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. ఓ వాహనంలో మూడు బస్తాల గంజాయిని గుర్తించి పట్టుకున్నారు. సమీప అడవి నుంచి గంజాయి బస్తాలు తీసుకువస్తున్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లగా మరో 20 బస్తాల గంజాయి దొరికింది. దీంతో మొత్తాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. ఈ గంజాయి మొత్తం 502 కిలోలు ఉంది. దీని విలువ రూ.60 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడు రాను పంగిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచారు.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితుడు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మధుర పహడ్ శివ మందిర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రమేష్ చంద్ర మజ్జి

కొరాపుట్: ఎన్నికల కోడ్ ప్రకటనకు కొద్ది గంటల ముందే కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పెద్ద ఎత్తున వివిధ పనులకు శంకుస్థాపనలు జరిగాయి. నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి జిల్లా వ్యాప్తంగా సుమారు 15 కార్యక్రమాలలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి, 5టీ నిధులు, ఎంపీ ల్యాడ్స్ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జొరిగాం, చందాహండి, నందాహండి, నబరంగ్‌పూర్ సమితుల్లో పర్యటించారు. కొన్నిచోట్ల నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని కూడా పాల్గొన్నారు. ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గొండో, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ వరుస శంకుస్థాపనలు చేశారు.

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన నిస్వార్థమైన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకుని ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్, డీఎస్పీ ఎల్ శేషాద్రినాయుడు, ఏఆ సీహెచ్ గోపీనాథ్, సీఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1782 కేసులు పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 1782 కేసులు పరిష్కరించారు. ఈ అదాలత్ జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు తదితర కోర్టుల్లో నిర్వహించారు. భార్య, భర్తల వివాదాలకు సంబంధించి 29 కేసులు, మోటార్ ప్రమాద కేసులు 47, ఎక్సైజ్ కేసులు 68, ఇతర కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడే పలాసలో ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మతల్లి ఆలయం ముందు క్యూకాంప్లెక్సు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎల్లమ్మ వీధిలో వెలసిన ఆలయంలో ఆదివారం జామి ఎల్లమ్మ జాతర జరగనుంది. పురాతన తర్లాకోట జమీందార్ల కాలం నుంచి సంప్రదాయ పద్ధతిలో జాతర నిర్వహిస్తున్నారు. లక్షలాది మంది జాతరకు తరలివస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలాసలో పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ చారిటబుల్ ట్రస్టు వారు సుమారు ఇరవై వేల మందికి అన్నదానం చేయడానికి ఏర్పాటు చేసినట్లు పీసీఎంఎ అధ్యక్షులు మల్లా సురేష్ వెల్లడించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పలాస ఎర్రచెరువు మీదుగా, జగన్నాథ సాగరం మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పలాస నుంచి శ్రీకాకుళం వైపుగా సంజయ్ గణపతి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా టెక్కలి మండలం బొప్పాయిపురం వద్దకు వచ్చే సరికి తన ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఆ బైక్‌పై ఉన్న జి.సిమ్మయ్య అనే వ్యక్తితో పాటుగా ఢీకొన్న గణపతికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌పై టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

14 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం

- మహానదిపై ఉన్నత స్థాయి వంతెనకు అంగీకారం
- స్టాంపు వెండర్ల కమీషన్ పెంపు



మంత్రి మండలి తీర్మానాలు మీడియాకు వివరిస్తున్న చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనాతో మంత్రి టుకుని సాహు

భువనేశ్వర్: కటక్ జిల్లాలో మహానది నదిపై ఉన్నత స్థాయి వంతెన నిర్మాణంతో సహా మొత్తం 14 ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి శనివారం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 7 శాఖలకు సంబంధించిన 14 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మీడియాకు తెలిపారు.

● రాష్ట్ర ప్రణాళిక కింద కటక్ జిల్లా సాలేపూర్ మండలం బ్రాహ్మణకంద – సాహుఖేత రహదారి వద్ద మహానదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ కటక్ – పారాదీప్ రహదారి, కటక్ – చాంద్‌బాలి రహదారి మధ్య ఇంటర్‌లింక్ కనెక్షన్ అందిస్తుంది. దీంతో నదికి ఇరువైపులా నివసించే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని జలవనరులు, వాణిజ్యం, రవాణా శాఖ మంత్రి టుకుని సాహు తెలిపారు.

● ఐటీఎల్ సీసీపీఎల్ (4) సంస్థకు నిర్మాణ పనులు కేటాయించారు. ఈ కార్యకలాపాల వ్యయ ప్రణాళిక రూ.1,28,71,00,000కి మంత్రి మండలి ఆమోదించింది. 36 నెలల్లో పనులు పూర్తి చేయాలని కాల పరిమితి నిర్ధారించింది.

● 2028–29 వరకు ఐదేళ్ల కాలానికి రూ.763.47 కోట్ల అంచనా వ్యయంతో నీటిపారుదల కమాండ్ లలో కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ (సిఏడీడబ్ల్యూఎం) కార్యకలాపాలు (వెర్షన్ 2.0)కి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

● ప్రీమియం, యాదృచ్ఛిక చార్జీలు లేకుండా చౌలియాగంజ్‌లోని 2.50 ఎకరాల విస్తీర్ణపు ప్రభుత్వ స్థలం డీఏవీ ఎస్‌సీఎస్ మెడికల్ పబ్లిక్ స్కూల్ సంస్థకు లీజుకిచ్చేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించింది. కొత్త పాఠశాల భవన నిర్మాణానికి గ్రౌండ్ అద్దెలో 0.25 శాతం ప్రీమియం, 75 శాతం సెస్, ప్రభుత్వ బకాయిల వడ్డీతో సహా మినహాయింపు కల్పించేందుకు అంగీకారం లభించింది.

● భువనేశ్వర్‌లో యాదవ్ భవన్ నిర్మాణానికి ఉత్కళ యాదవ్ మహాసభకు అనుకూలంగా చంద్రశేఖర్‌పూర్‌లోని ప్రభుత్వ భూమి లీజుకు రూ.5,06,00,000 ప్రీమియం మినహాయించాలని నిర్ణయించారు.

● లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్లు రూ.1 నుంచి రూ.25000 విలువైన నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్లను విక్రయించడంలో దాదాపు 1 శాతం నుంచి 4 శాతం కమీషన్ పొందుతున్నారు. ఈ-స్టాంపింగ్ విధానంలో అధీకృత సేకరణ కేంద్రం (ఏసీసీ) లైసెన్స్ పొందిన స్టాంప్ విక్రేతలు ఈ-స్టాంప్ పేపర్ల జారీపై స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ అందించే కమీషన్ కంటే ఎక్కువగా 0.85 శాతం కమీషన్ మంజూరుకు మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్ల సేకరణ ధరను తగ్గించడం, ఈ-స్టాంపింగ్ ప్రవేశపెట్టే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: ఎన్నికల సమయంలో జయపురం సమితిలోని పలు పంచాయతీల నుంచి ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం సాయంత్రం అంబాగుడలో జరిగిన ఒక కార్యక్రమంలో కుములిపుట్, అంబాగుడ గ్రామ పంచాయతీల్లో పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బాహిణీపతి కండువాలు కప్పి స్వాగతించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తెజ్ నాయిక్, తేజ్ మహురియ, గంగాధర నాయిక్, గురు జాని, రవి నాయిక్, అబగుడ పంచాయతీలో దొయితారి పాయిక్,ప్రహ్లాద్ పాయిక్,గౌరీ పట్నాయిక్, సునాధర భూమియ, బలహద్ర బూమియ తదితరులు ఉన్నారు.

బరంపురంలో ఫ్లాగ్‌మార్చ్



టౌన్ పోలీసు స్టేషన్ పరిధి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గంజాం జిల్లా బరంపురం నగరంలో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశంతో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో రెండు బెటాలియన్ పోలీసుల బృందాలు కవాతు చేపట్టారు. అనుమానిత వాహనాలను పెద్ద బజార్ పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం : స్థానిక గజపతినగర్‌లో స్వేచ్ఛా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం సమితి అధ్యక్షుడు టి.పార్థసారథి, కార్యదర్శి ఆర్.లక్ష్మి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లు, హోర్డింగ్‌ల తొలగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం మధ్యాహ్నం విడుదల చేయడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుల్లోకి వచ్చింది. దీంతో జిల్లా కేంద్రంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల, ప్రజాప్రతినిధుల హోల్డర్‌లు, బ్యానర్‌లు తొలగింపు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం వంటి కార్యక్రమాలను ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య శనివారం చేపట్టారు. ప్రవర్తనా నియమావళి అమలు కావడంతో 24గంటల్లోపు ప్రభుత్వ స్థలాలలో ఇలాంటి బ్యానర్‌లను తొలగించాల్సి ఉందన్నారు. 48 గంటల్లోపు ప్రైవేటు ఆస్తుల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు నియమావళి పాటించాలని తెలిపారు.

సరిహద్దులో నిఘా పటిష్టం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్‌రాష్ట్ర సరిహద్దులో నిఘా పటిష్టం చేసినట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఏఓబీలో దాదాపు 112 కిలోమీటర్ల మేర 52 రహదారుల ద్వారా రాకపోకలు సాగుతున్నాయని, వీటిలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇవి కాకుండా నిరంతరం పెట్రోలింగ్ టీమ్‌లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు.

విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక కలిసి మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే తీసుకోనున్న చర్యలను వివరించారు. వేసవి తాగునీటి ప్రణాళిక, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితర జిల్లా అధికారులు కూడా హాజరయ్యారు.

రూ.35 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

రణస్థలం: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఆపన్న హస్తం అందిస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 40 మంది పేదలకు రూ.35 లక్షల 57వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఉదయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఐదేళ్లలో 359 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 78 లక్షల 57వేలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

42 రోజుల్లో.. 37 వేల క్వింటాళ్ల పంచదార తయారీ



అస్కా చెక్కర కర్మాగారం

బరంపురం: అసియా ఖండంలోనే మొట్ట మొదటి చెక్కర కర్మాగారం 1824లో గంజాం జిల్లాలో అస్కా పట్టణంలో స్థపించారు. అస్కా చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది 42 రోజుల్లో 49 మెట్రిక్ టన్నుల చెరకుతో 37 వేల కింటాళ్ల పంచదార తయారీ పూర్తయింది. ఈ విషయాన్ని అస్కా చక్కెర కర్మాగారం (అస్కా సుగర్ ఇండస్ట్రియల్ లిమిటెడ్) చైర్మన్ గాయత్రిదేవ్ నాయక్ శనివారం తెలియజేశారు. గతేడాది జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు 38 మెట్రిక్ టన్నుల చెరకుతో 27,854 కింటాళ్ల పంచదార తయారీ అయిందన్నారు. ఈ ఏడాది 49 మెట్రిక్ టన్నుల చెరకుతో 37 వేల కింటాళ్ల పంచదార తయారు చేశామన్నారు.

అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాయ్

రాయగడ : జిల్లాలోని జేకేపూర్ పేపర్ మిల్ యాజమాన్యం, జేకే స్పోర్ట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అనిల్ సింహ్ మెమోరియల్ అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను మెకానికల్ విభాగం మేనేజర్ ఎంఆర్‌కే రాయ్ ప్రారంభించారు. ఈ నెల 23 వరకు జరిగే ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ఆమో ఒడిశా నవీన్ ఒడిశా జిల్లా సమన్వయకర్త గౌరీశంకరరావు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



ములసర అడవిలో సారా తయారీ సామగ్రి



కొలాగుడ బట్టీలపై దాడులు నిర్వహించిన పోలీసులు

జయపురం: జయపురం సదర్ పోలీసులు జయపురం సమితి కొలాగుడ, భైరాగిమఠం ప్రాంతాల్లో నాటు సారా బట్టీలపై శనివారం ఉదయం దాడులు జరిపారు. ఈ దాడుల్లో పలు సారా బట్టీలను నాశనం చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఇప్ప ఊటను ధ్వంసం చేశారు. కొలాగుడ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న బట్టీలో 330 లీటర్ల ఊటను పారబోశామని, ఆ బట్టీలో 200 లీటర్ల నాటు సారాను జప్తు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. భైరాగిమఠం ప్రాంతంలో జరిపిన దాడుల్లో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 4 క్వింటాళ్ల ఇప్ప, యూరియ మిశ్రమాన్ని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అలాగే జయపురం సమితి ములసర అడవిలో అబ్కారీ సిబ్బంది సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. శుక్రవారం జరిగిన దాడుల్లో 200 నాటు సారా, 1,800 లీటర్ల ఇప్ప ఊటను ధ్వంసం చేసినట్లు అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్ వెల్లడించారు.

మాజీ సర్పంచ్ హత్య



సింగు తడంగి (ఫైల్)



గోతిలో సింగు తడంగి మృతదేహం

కొరాపుట్: జిల్లాలో నారాయణపట్న సమితి బరగుమండి పంచాయతీ మాజీ సర్పంచ్ సింగు తడింగి(32) హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పొలానికి వెళ్లిన తడింగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సమీప ప్రాంతాల్లో వెతికారు. నారాయణపట్న సమితికి 20 కిలోమీటర్ల దూరంలో గోతి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వేరే చోట హత్య చేసి ఇక్కడ గోతిలో పూడ్చి పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపట్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రానున్న పదేళ్లు నిర్ణయాత్మకం

- మంత్రి మండలి సమావేశంలో సీఎం నవీన్

భువనేశ్వర్ : ఒడిశా ప్రజలు రాబోయే కొద్ది నెలల్లో దేశ రాజకీయ చరిత్రలో కొత్త రికార్డు సృష్టించబోతున్నారని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. రాబోయే 10 సంవత్సరాలు నిర్ణయాత్మకమని తెలిపారు. శనివారం జరిగిన చివరి మంత్రి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఒడిశా ప్రజలు తమ విశ్వాసాన్ని పదే పదే నిలబెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో నాలుగున్నర కోట్ల కుటుంబానికి సేవ చేసేందుకు ఎన్నిక కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తొలి రోజుల్లో రాష్ట్రం అరుదైన వేసవి తుఫానును ఎదుర్కొందని గుర్తు చేశారు. విపత్తు నిర్వహణలో ఒడిశా మోడల్‌గా నిలిచిందన్నారు. కోవిడ్ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పంచాయతీలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ఈ-లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ సెంటర్, స్పోర్ట్స్ సౌకర్యాలు మొదలైన వాటితో పాఠశాలల రూపురేఖలను మార్చామని చెప్పారు. సున్నా వడ్డీ రేటుకు రూ. లక్ష రుణాన్ని అందించి స్వయం ఉద్యోగ సంస్థల ఏర్పాటుకు యువతరం సాధికారతకు పట్టంగట్టామన్నారు. రౌర్కెలాలో 15 నెలల్లో ప్రపంచంలోనే అతిపెద్ద సీటెడ్ హాకీ స్టేడియన నిర్మాణం క్రీడా రంగంలో సరికొత్త మలుపుగా పేర్కొన్నారు. ఒడిశా భారత క్రీడా రాజధానిగా మారిందన్నారు. బిజు స్వాస్థ్య కళ్యాణ్ యోజన కింద సార్వత్రిక కవరేజ్ పేద, మధ్యతరగతి వారికి దేశవ్యాప్తంగా ఉన్నతమైన ప్రైవేట్ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. నేడు మేము పథకం కింద ప్రతి సంవత్సరం రూ 3,500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గిరిజన భాషలను మరింత పరిరక్షించేందుకు ఒడిశాలోని 21 గిరిజన భాషల్లో బహుభాషా బోధన ఉండేలా ప్రవేశ పెట్టిన చొరవ కార్యాచరణ కోసం కొత్త ఉపాధ్యాయ పోస్టులను భర్తీ పూర్తి అయిందన్నారు. గత ఐదేళ్లలో పేదరికం గణనీయంగా తగ్గిన కొన్ని రాష్ట్రాల్లో ఒడిశా ఒకటిగా పేర్కొన్నారు. 2036లో ఒడిశా రాష్ట్ర శతాబ్ది ఉత్సవాలు జరుపుకోబోతున్నామని, అప్పటికి ప్రతి రంగంలో ఒడిశా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

పరిణయ వేడుక



సారె తీసుకువచ్చిన మేనమామలకు గౌరవిస్తున్న బంధువులు



వివాహ సందడిలో నువ్వలరేవు

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో సామూహిక వివాహ వేడుక అపురూప రీతిలో జరిగింది. మొత్తం 62 జంటలు రాత్రి 1.55 నిమిషాల ముహూర్తంలో మాంగళ్య ధారణతో ఒక్కటయ్యాయి. అనాదిగా వస్తున్న సంప్రదాయాలను పాటిస్తూ పెళ్లి వేడుకను జరిపించారు. వరకట్నాల ప్రస్తావన లేకుండా వధువు,వధువు మేనమామ ఆర్థిక స్తోమత బట్టి నెల రోజులకు సరిపడా సారె సామాన్లు ఇచ్చారు. పెళ్లి తంతులో భాగంగా నవవధూవరులకు మంగళ స్నానాలు చేయించి వధువులకు తెల్లని చీర, నగలు, పసుపు కుంకుమ నిండైన తిలకంతో చేతికి సగం వరకు నిండుగా గాజులు ధరించి, కిరీటంతో అలంకరించారు. అలాగే నవవరులు తెల్లని లాల్చీ, ప్యాంట్, షర్ట్‌లను ధరించి వాటిపై ఎర్రని పైజామా వేసి నల్లటి కళ్లద్దాలు పెట్టుకుంటూ మెడలో నగదు దండ,కిరీటం ధరించారు. వేద మంత్రాలు నలు దిక్కులా ప్రతిధ్వనిస్తుండగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆశీస్సులతో అర్ధరాత్రి 1.55 నిమిషాలకు 62 జంటలు ఒక్కటయ్యాయి. వధువుల మెడలో వరులు మొదట తాళి కట్టగా.. ఆ తర్వాత వరుల మెడలో వధువులు తాళి కట్టారు.

పర్యాటకానికి జీవం

- జిల్లాలో ఆరు చోట్ల మౌలిక నదుపాయాల అభివృద్ధికి నిర్ణయం
- రూ.7.05కోట్ల ఉపాధి హామీ నిధులతో రహదారులు మంజూరు



పోలాకి మండలం జగతిమెట్ట వద్ద రహదారిపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన క్రిష్ణదాస్

పోలాకి: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల్లో ఆరుచోట్ల రూ.7.05కోట్లతో పలు రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యాటక రంగం మెరుగుపడేందుకు ప్రధానంగా రహదారుల అవసరాన్ని గుర్తించిన అధికారుల నివేదిక ఆధారంగా ఈ నిధులు మంజూరైనట్లు సమాచారం. సంబంధిత పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఆమోద తీర్మానాలు ప్రకారం పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి.

మంజూరైన రహదారులు ఇవే..

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో వెంకన్నగారిపేట వద్ద మెగా టూరిజం పార్క్ బీటీ రహదారి నిర్మాణం ఎచ్చెర్ల నుంచి పొన్నాడ బాలభారతిరోడ్ జంక్షన్ వరకు రూ.1కోటి రూపాయలు నిధులతో రహదారి.
- శ్రీకాకుళం నియోజకవర్గంలో పెద్దగనగళ్లపేట సముద్రతీరానికి రూ.1.5కోట్లు నిధులతో రోడ్డు.
- నరసన్నపేట నియోజకవర్గంలో అతిపురాతన బౌద్ధ స్తూపం జగతిమెట్టకు అప్రోచ్ రహదారి కోసం 70లక్షలు.
- టెక్కలి నియోజకవర్గంలో విదేశీపక్షుల స్థావరం తేలినీలాపురం గ్రామానికి ఎన్‌ఎం రోడ్ నుంచి సీసీ రహదారి నిర్మాణానికి రూ.1.95కోట్లు.
- టెక్కలి నియోజకవర్గంలో భావనపాడు స్టేడియంకు సీసీ రహదారితోపాటు సైడ్‌వాల్ నిర్మాణానికి రూ.90లక్షలు.
- పాతపట్నం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక ప్రకృతి జీవన విధాన కూర్మ గ్రామానికి అంతకాపల్లి నుంచి బీటీరహదారి నిర్మాణం కోసం రూ.1కోటి నిధులు మంజూరయ్యాయి.

క్లుప్తంగా

'గేట్'లో రఘురాంనాయుడుకు 889వ ర్యాంకు


బోని రఘురాం నాయుడు

గజపతినగరం: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన బోని రఘురాంనాయుడుకు శనివారం వెలువడిన ఆల్ ఇండియా గేట్ ఫలితాల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 889వ ర్యాంకు వచ్చింది. నాయుడును తల్లితండ్రులు బోని శ్రీనివాసరావు, అనసూయతో పాటు స్థానికులు అభినందించారు.

898 ర్యాంకు సాధించిన చాణిక్య విహార్


చాణిక్యతో తండ్రి జగన్

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామానికి చెందిన చల్లా చాణిక్య విహార్ గేట్‌లో జాతీయ స్థాయిలో 898వ ర్యాంకు సాధించాడు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ కుమారుడైన చాణిక్య 6 నుంచి పదో తరగతి వరకు కిల్తాంపాలెంలోని నవోదయ పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియెట్‌లో 980 మార్కులు సాధించి జేఈఈ మెయిన్స్‌లో ఎనిమిది వేల ర్యాంకు సాధించి తంజావూర్‌లో శాస్త్ర యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. చాణిక్యను తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా వెంకటేశ్వరరావు

- ఉత్తర్వులు జారీ చేసిన శాప్


జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా నియామకమైన వెంకటేశ్వరరావు

విజయనగరం: విజయనగరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా అధికా రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావును విజయనగరం బదిలీ చేయడంతో పాటు ఆ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు విజయనగరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా వ్యవహరించిన ఎం.అచ్యుత్‌కుమార్‌ను విశాఖ జిల్లా గోపాలపట్నంలోని ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాద స్థలంలో ఈశ్వరరావు మృతదేహం

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్.కోట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పచ్చిపులుసు ఈశ్వరరావు(53) అతని భార్య రమాదేవితో కలిసి బైక్‌పై విజయనగరం వైపు శనివారం వెళ్తున్నారు. తానవరం గ్రామానికి చెందిన బత్తుల మహేష్, వెంకటరమణ, పేట గ్రామానికి చెందిన ముసినాన శివ బైక్‌పై ఎస్.కోట వైపు వెళ్తున్నారు. వసాది గ్రామం దాటిన తర్వాత కొత్త వెలగాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా రెండు వాహనాలు బలంగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న వారు, వెనుక కూర్చొన్న వారు తుళ్లి కింద పడిపోయారు. వీరిలో తలకు బలమైన గాయమైన ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. రమాదేవి, మహేష్, శివలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సులపై చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ సురేంద్ర నాయుడు చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తెలగలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ఉత్తరాంధ్ర తెలగ సంఘు అధ్యక్షుడు చనుమల్ల

విజయనగరం టౌన్: తెలగ కులస్తులకు రాష్ట్ర వ్యాప్తంగా 75 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చనుమల్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలగ కులస్తులకు ఉత్తరాంధ్ర జిల్లాలో విజయనగరం జిల్లాకు సంబంధించి విజయనగరం, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రెండు, విశాఖలో నాలుగు స్థానాలు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్రలో జెడ్పీ చైర్మన్‌లు, డీసీసీబీ చైర్మన్‌లు, డీసీఎంఎస్ , జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ వంటి నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్‌లు తగ్గించకుండా పది శాతం రిజర్వేషన్‌లు కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో మునిశెట్టి శాంతమ్మ, రామారావు, కాజా సత్యనారాయణ, తాడి నానాజీ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజ మార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి


కక్షిదారులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా న్యాయమూర్తి బి.సాయికళ్యాణచక్రవర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాజీయే రాజ మార్గమని, వివిధ తగాదాలలో వ్యక్తుల మధ్య రాజీ కుదిర్చి ఇరు పార్టీలకు సమన్యాయం చేయడమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను కాపాడు కోవాలని, దూరం చేసుకోరాదని, కుటుంబ సభ్యులు పట్టింపులకు పోయి కలహాలతో చక్కని జీవితాలను పాడు చేసుకొంటున్నారన్నారు. వీటిని మనమే సరిదిద్దుకోవాలని అప్పుడే వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు పెరుగుతాయని అన్నారు. లేనిపోని తగాదాలకు పోయి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని, డబ్బును వృధా చేయవద్దన్నారు. ఈ మధ్య కాలంలో కుటుంబ తగాదాలు ఎక్కువగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనవసర కలహాలు మాని పిల్లల భవిష్యత్ కోసం, మనమీద ఆధార పడ్డ వారి కోసం అహం వీడి రాజీకి రావాలని హితవు పలికారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం సివిల్ మరియు పరిష్కరించదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరిగిందని అన్నారు. శనివారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉన్న కోర్టులైన విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, గజపతినగరం, చీపురుపల్లి, కొత్తవలస, కురుపాం తదితర కోర్టులలో మొత్తం 1,220 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.రజని, ఎమ్.మీనాదేవి, జడ్జి ఫ్యామిలీ కోర్టు మరియు అదనపు మూడవ జిల్లా న్యాయ మూర్తి, సికెందర్ భాషా, స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ కేసెస్ అండర్ ఎస్సీ, ఎస్టీ మరియు నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.పద్మావతి, స్పెషల్ జడ్జి ఫర్ ట్రయల్ ఆఫ్ ఆఫెన్సెస్ ఉమెన్ మరియు ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నాగమణి, న్యాయమూర్తి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి, సీనియర్ సివిల్ జడ్జి మరియు కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికారిణి రమ్య, అడిషనల్ జుడిషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తి కె.మోహిదెన్ జమూరత్ బేగం, మొబైల్ న్యాయమూర్తి జె.సౌమ్య జోసిఫిన్, స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ ట్రయల్ ఆఫ్ కేసెస్ అండర్ అఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిహెచ్.దామోదర రామ్మోహన రావు కక్షిదారులు పాల్గొన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. పీఏఎస్ రాజు, పంపాన రవికుమార్ సీనియర్ న్యాయవాదుల సహకారంతో కక్షిదారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో 129 మోటార్ ప్రమాద బీమా కేసులు, రూ.2,43,57,061 మొత్తాన్ని కక్షిదారులకు అందజేయనున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులు	
విజయనగరం	757
పార్వతీపురం	56
బొబ్బిలి	137
సాలూరు	76
శంగవరపుకోట	52
గజపతినగరం	34
చీపురుపల్లి	31
కొత్తవలస	63
కురుపాం	14
మొత్తం కేసులు	1220

కోడ్ కూసింది... పోస్టర్లు తీయండోచ్..


కలెక్టరేట్‌లో ప్రచార పోస్టర్లను తీసివేస్తున్న సిబ్బంది

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. జాతీయ ఎన్నికల కమిషన్ శుక్రవారం సార్వత్రిక ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్ర శాసన సభ ఎన్నికలు నిర్వహించే షెడ్యూల్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనావళిని జిల్లా యంత్రాంగం విడుదల చేసి శనివారం సాయంత్రం నుంచి అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయం పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ పథకాల ప్రచార పోస్టర్లను తీసివేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

నిబంధనల ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

- పబ్లిక్ ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న ప్రచార పోస్టులను 24 గంటల్లో తీసేయాలి. ఎలాంటి ప్రచార పోస్టర్లను పెట్టాలన్నా జిల్లా ఎన్నికల యంత్రాంగం నుంచి అనుమతి ముందుగా తీసుకోవాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ స్థిరాస్తులైన భవనాలు, స్తంభాలు వంటి ప్రాంగణాల్లో ఉన్న భారీ ఫ్లెక్సీలు తదితర ప్రచార పోస్టర్లను 48 గంటల్లో తొలగించాలి.
- రాజకీయ ప్రచార, విందు కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు పాల్గొనరాదు. ఏ పరిస్థితిలోనైనా వారు పాల్గొంటే కఠినమైన క్రమశిక్షణ చర్యలు ఉంటాయి.
- ప్రభుత్వ వాహనాలు వినియోగించే మంత్రుల వాహనాలు పరిపాలన పరమైన కార్యక్రమాలకు మాత్రమే తీసుకెళ్లాలి.
- ప్రధాన కూడళ్లలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలను మూసివేయాలి. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి జాతీయ నాయకుల విగ్రహాలకు నిబంధనలు వర్తించవు.
- ఈ నిబంధనలపై ముగ్గురు సభ్యులతో పర్యవేక్షణ కమిటీలను కలెక్టర్ వేశారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారి, మండల స్థాయిలో ఎంపీడీఓ, పంచాయితీ స్థాయిలో సెక్రటరీలతో ఈ కమిటీలు పర్యవేక్షణ ఉంటుంది.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలుశిక్ష

- దిశా ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్

విజయనగరం క్రైమ్: అత్యాచారం కేసులో నిందితుడికి మూడున్నరేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఏడీజే న్యాయమూర్తి తీర్పును శనివారం వెల్లడించినట్లు దిశా మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. భోగాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన చిల్ల ఈశ్వరరావు స్థానికంగా ఉంటున్న ఒక మహిళ ఇంట్లోకి 2022 ఏప్రిల్ 29న ప్రవేశించి ఆమెపై అత్యాచారం చేసేందేకు యత్నించినట్లుగా ఆ మహిళ దిశా మహిళా పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కెటిఆర్.లక్ష్మి కేసు నమోదు చేయగా, సీఐ ఎం.శేషు దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితుడు ఈశ్వరరావుపై నేరారోపణ రుజువు కావడంతో 5వ ఏడీజే, మహిళా కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మావతి మూడున్నరేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. కేసులో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు.

ఆపన్నహస్తం

- 38 మంది లబ్ధిదారులకు రూ.40.51 లక్షల పరిహారం
- సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే శంబంగి


సీఎంసహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఆపదకాలంలో ఆదుకునే ముఖ్యమంత్రి సహాయ నిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. బొబ్బిలిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 38 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.40.51లక్షలను చెక్కుల రూపంలో శనివారం అందజేశారు. ఓ వైపు ఆరోగ్యశ్రీ పథకం ఖర్చు ఆర్థిక పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవారికి సీఎం సహాయనిధిని అందిస్తూ ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గంలోని 153 మంది దరఖాస్తుదారులకు రూ.1,45,34,000లను అందజేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మి అప్పలనాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎంఓ సురేష్‌బాబు

విజయనగరం ఫోర్ట్: గ్లకోమా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఎస్.సురేష్‌బాబు సూచించారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో శనివారం గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రోగ లక్షణాలు ఉండి కొన్ని వ్యాధులు ఇబ్బంది పెడితే, లక్షణాలు లేకుండా కంటి చూపును తగ్గించే ప్రమాదకరమైన జబ్బు గ్లకోమా అని అన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం కావున కంటి చూపు పట్ల ఎవరు అశ్రద్ధ వహించరాదని చెప్పారు. వారసత్వంగా వచ్చే జబ్బులలో గ్లకోమా నేత్రవ్యాధి ఒకటి అని అన్నారు. గ్లకోమా వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కంటి వైద్యురాలు బి.సంధ్యారాణి మాట్లాడుతూ 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ పావని, ఎం.రమ్య, డాక్టర్ భార్గవి, డాక్టర్ అఖిల, అప్తాలమిక్ అధికారులు బాలాజీ ప్రాణిగ్రాహి, ఎస్వీ కృష్ణారావు, రిఫ్రాక్షనిస్ట్ సాయి , కౌన్సిలర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి జారి పడి వ్యక్తి మృతి


నారాయణరావు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలసలో చింత చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... నాయుడువలస గ్రామానికి చెందిన మత్స నారాయణరావు(46) చింత పండు బొట్టలు దులిపేందుకు తన పొలంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. బొట్టలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో చెట్టు కింద ఉన్న పశువులు కట్టే కొయ్యకు తల తగిలి తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు బాడంగి సీహెచ్‌సీకి తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు అక్కడి వైద్యాధికారులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నారాయణరావు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

104 అంబులెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం

104 అంబులెన్స్ ఉన్న స్థలానికి 10 అడుగుల దూరంలో ఉన్న చెట్టు పైనుంచి నారాయణరావు పడిపోయాడు. దగ్గరలో ఉన్నా.. పరిశీలించేందుకు రావాలని కేకలు వేసినా 104 సిబ్బంది రాలేదని భార్య రామలక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి నడిమింటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది మానవత్వం చూపలేదని ఆరోపిస్తున్నారు. ఇక మా గ్రామానికి 104 అంబులెన్స్ రావద్దని, వస్తే అడ్డుకుంటామని ఆ గ్రామ ప్రజలు అంబులెన్స్ ముందు ఆందోళన చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామంలో శనివారం ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. వేదపండితులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని, అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పర్ణశాలలో చండీహోమం పూజలు నిర్వహించారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్న

బంగారు ఆభరణాల చోరీ

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో శుక్రవారం అర్ధరాత్రి 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వరుపుల సత్యంబాబుకు ఇద్దరు కుమారులు వాసుదేవరావు, రాము ఉన్నారు. ఇద్దరు కుమారులు ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు వాసుదేవరావు మూడు రోజుల కిందట తన భార్యను తీసుకుని ఎస్.కోటలో నివాసముంటున్న అత్తగారింటికి వెళ్లాడు. ఇదే అదునుగా చూసుకుని గుర్తు తెలియని వ్యక్తి వాసుదేవరావు నివాసముంటున్న గదిలోకి చొరబడి 8 తులాల బంగారు అభరణాలను అపహరించుకుని పారిపోయాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి దీంతో ఇంట్లో బంగారు ఆభరణాలు లేకపోవడంతో వాసుదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్యకుమారి(క్లూస్ టీం) సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు.

బెదిరించి బంగారం దోపిడి

- బాధితురాలికి తీవ్ర గాయాలు


చోరీ జరిగిన సత్యనారాయణ ఇంట్లో పరిశీలిస్తున్న సిఐ తిరుమలప్రసాద్, క్లూస్‌టీం


దొంగలు బీరువాలో బట్టలు చిందరవందర చేసిన దృశ్యం

రామభద్రపురం: మండల కేంద్రంలోని సోంపురం రహదారిలో శుక్రవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో అంతరాష్ట్ర దొంగలు భార్యాభర్తలను బెదిరించి బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంటి యజమాని, బాధితుడు రుద్రాక్షుల సత్యానారాయణ తెలిపిన వివరాలు... శుక్రవారం రాత్రి సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో నిద్రలోకి వెళ్లగా అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు బయట తలుపులు డ్రిల్లింగ్ మిషన్‌తో కట్ చేసి ఇంట్లోకి ప్రవేశించారు. నేరుగా బెడ్ రూంలోకి వచ్చి ఒకడు తన మెడపై కత్తి పెట్టగా, మరొకడు ఇనుప రాడ్డుతో తన భార్యను పట్టుకుని ఇంట్లో ఎక్కడెక్కడ బంగారం, డబ్బు ఉందో చెప్పాలని బెదిరించారు. తన భార్యను పట్టుకున్న వాడు ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు తీసి ఇవ్వాలని అడగగా ఆమె నిరాకరించింది. దాంతో ఆమె చేతిపై ఇనుపరాడ్డుతో బలంగా కొట్టాడు. వెంటనే ఆమె భయపడి మెడలోని బంగారం ఇచ్చేసింది. మూడో వ్యక్తి బీరువాలో ఏముందేమోనని వెతికి ఏమి లేకపోవడంతో బీరువాను చిందరవందర చేశాడు. ఇంతలో ఇంటి ముందర నుంచి ఏదో వాహనం వెళ్లడంతో కిటికిలోంచి బెడ్ రూంలోకి లైటింగ్ వచ్చింది. దాంతో వారు పోలీస్ వాహనం వస్తుందన్న అనుమానంతో మమ్మల్ని వదిలేసి పారిపోయారని తెలిపాడు. సెల్‌ఫోన్లను రాడ్డుతో పగులకొట్టారని తెలిపాడు. ఆ ముగ్గురు హిందీలో మాట్లాడుతున్నారని తెలిపాడు. వారు పారిపోయాక పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ తిరుమల ప్రసాద్, ఎస్‌ఐ జ్ఞానేశ్వరరావు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఇంట్లోని వస్తువులపై వేలి ముద్రలు సేకరించారు. చేతికి తీవ్ర గాయమైన భార్యకు బాడంగి సీహెచ్‌సీలో చికిత్స అందించారు. బాధితుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర


పూజలందుంటున్న పోలిపల్లి పైడితల్లి

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పోలిపల్లి పైడితల్లి జాతరకు రంగం సిద్ధమైంది. 98వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నుంచి జరగనున్న ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15వ తేదీన నేత్రోత్సవం నిర్వహించగా, 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, విశాఖపట్నం, విజయవాడ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ జాతరకు రానున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతర నేపథ్యంలో చిరువ్యాపారుల దుకాణాలతో పాటు జెయింట్ వీల్, సర్కస్ సెట్లు తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం నుంచి కిలోమీటరు మేర విద్యుత్ దీపాలంకరణ చేశారు. జాతర జరిగే మూడు రోజులూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు..

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ మోహనరావు తెలిపారు. బొబ్బిలి జంక్షన్ మీదుగా వచ్చే భక్తుల వాహనాలను పోలీస్ క్వార్టర్స్ వద్ద పార్కింగ్ చేయాలని, బొబ్బిలి వైపు నుంచి వచ్చే వాహనాలను మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో,.. మెంటిపేట మీదుగా వచ్చే వాహనాలు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద పార్కింగ్ చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు క్యూలైన్ తప్పనిసరిగా పాటించాలని, అలాగే వెంట తీసుకువచ్చే విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. జాతర దృష్ట్యా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామన్నారు. బొబ్బిలి వైపు నుంచి రాజాం వస్తున్న వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి గార్రాజుచీపురుపల్లి, జండాల దిబ్బ మీదుగా రాజాం చేరుకోవాలని, బొబ్బిలి వైపు వెళ్లే వాహనాలు బొద్దాం, జండాల దిబ్బ చేరుకుని గార్రాజుచీపురుపల్లి చేరుకుని చీకటిపేట జంక్షన్‌కు చేరుకోవాలన్నారు. బొబ్బిలి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఎటువంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరిద్దాం

- ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై కలెక్టర్ సమీక్ష

విజయనగరం అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సాధారణ, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిందని, జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో అన్ని శాఖల ప్రభుత్వ అధికాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలు నేపథ్యంలో జిల్లా అధికారులంతా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, పోర్టల్‌లు తదితర ఆన్‌లైన్ వేదికల్లో ఉన్న నాయకుల ఫొటోలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. వివిధ ఇంజినీరింగ్ శాఖల ద్వారా అభివృద్ధి పనుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రారంభించి జరుగుతున్న పనులను కొనసాగించవచ్చని, పనులు మంజూరైనప్పటికీ తాజాగా ప్రారంభించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అందించే ఎండీయూ వాహనాలు, 104, 108 వంటి మొబైల్ వాహనాలపై ఉండే రాజకీయ నేతల ఫొటోలను మూసివేస్తూ స్టిక్కర్లు అతికించాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని మండలాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఎన్నికలు పూర్తయ్యే వరకు రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్ఓ ఎస్.డి.అనిత, సీపీఓ పి.బాలాజీ, జిల్లా అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి : ఆర్‌జేడీ


బంగారమ్మ కాలనీలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

సాలూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. పట్టణంలోని బంగారమ్మ కాలనీలో శనివారం నిర్వహించిన గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పౌష్టికాహారాలు సక్రమంగా తీసుకోవడం వలన రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని అన్నారు. తద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వివరించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాచిపెంట మండలంలో కోష్టువలస అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అందిస్తున్న పౌష్టికాహారాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, డాక్టర్ ప్రియాంక, అంగన్‌వాడీ నాయకురాలు బలగ రాధ, వైఎస్సార్‌సిపి నాయకురాలు రాంబాయి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.